పులుసు

— భూషణం

పిట్టపాడు గ్రామంలో తెల్లవారు ఝామున నాయుళ్ళ కోళ్ళు 'కొక్కొరొకో' అని కూతకూసేయి. నాయుళ్ళ కోళ్ళ కూతలకు మాలపేట కోడిపుంజులు లేచి రెక్కలు 'టపటప' దులుపుకొని శ్రుతి కలపగా సాలల్లోని పశువులు కుడితి తాగడానికి కదులాడసాగాయి. దుక్కి పూజులు భుజాన వేసుకొని కాపులు కళ్ళాలవైపు కదులుతున్నారు. నాయురాళ్ళు పేడతట్టలు పట్టుకొని కసవు ఊడ్చడానికి చీపుర్లతోసహా కదిలేరు.

పిట్టపాడు నిద్రవదలి మేల్కొంటుంది.

మాలపేటలో సంగడు అంకమ్మ పక్కనుండి బద్ధకంగాలేచి ఒళ్ళు విరుచుకొని తడకతీసి వీధిలోనికి వచ్చేడు.

అప్పటికే పక్కగుడిసెలోని గుంపడు కట్టుకొయ్య కున్న కోడిపెయ్య ముందర గడ్డి వేస్తున్నాడు. ఎదుట పాకలోని 'బోడెమ్మ ముసిలి గడప తుడుస్తుంది. సంగడు మరొకసారి బద్ధకంగా ఆవులించి చింకిగంపలో ఉంచిన పచ్చగరిక పరకలు తీసి పడ్డపెయ్యకు వెయ్యడానికి వెళ్ళేడు. సంగడ్ని చూసిన గుంపడు కోడిపెయ్య దగ్గర నుండి వస్తూ

''ఇయాల బుదోరంగదా సంగన్నా! సింతపండు కెల్దువేటి?'' అని అడిగేడు.

సంగడు ఇంకా సమాధానం చెప్పకముందే గడప తుడుస్తున్న బోడెమ్మముసిలి గుంపడి మాటవిని చీపురు గడపల పడేసి వస్తూ

"ఔన్రా సంగా! నిజంగా సంతకెల్తారేట్రా? నానూ వొత్తాను. పుల్లటి పులుస్సుక్కతాగి సానారోజులైపోనాది. సింతపిక్క సవికోసం జిమ్మ సచ్చిపోనాదిరా! పాడుముండ కాలం కాపోతే పయిదు పంటలకిందట పందులు తినీవికాదు సింతపండుని. ఎక్కడ సూసినా ఎక్కితొక్కిడిగా దొరికీది. అదేటి మాయరోగం వొచ్చి పడిపోనాదో! సింతపండు వొట్టుకొనొచ్చినోల వొల్లు వోయగొట్టెత్తన్నారు; ఆ కారప రేసన్నాగండలు, ఆ లెక్కడొచ్చినాన్రా ఈ మద్దిన మన పీకలమీదికి: ముండగండలు... ...కుక్కల కొడుకులు" అని తిట్లకు లంకించుకుంది.

బోడెమ్మముసిలి నోరు విప్పిందంటే మరిక మూత పడదని తెలిసిన గుంపడు, ముసిలిదాన్ని కోప్పడుతూ

"వల్లకోయే ముసిలిముండా! వుత్తుత్తి కూకలేల! సంగన్న బయలెల్దుంవంటే సంతకి ఎల్దుంగాని. ఏంవన్నా! ఏటంటావు?" అని సంగడ్ని అడిగేడు.

అప్పటికీ సంగడు మాటాడకుండా సందిట్లో ఉన్న పచ్చగడ్డి పరకలు పడ్డపెయ్యముందు పడేసి దాని వీపుమీద చరుస్తూ "ఛా...ఛో..." అని పడుకున్న పడ్డపెయ్యని లేపేడు. పడ్డపెయ్య లేచి ముందున్న గడ్డిలోకి మూతి పెట్టింది.

సంగడి వెనకనే వచ్చి గడప ఊడ్చడానికి చీపురు పట్టుకు నిల్చున్న అంకమ్మ; సంగడు బెల్లం గొట్టిన రాయిలా మాటాడక పోవడం చూసి నిష్ఠూరంగా

''ఆడెందుకు బయలెల్తాడు?. వోరం రోజుల్నుండీ సెవల ఇల్లు కట్టక సెపతన్నాను; సింతపండు కెల్లమని! పంతులుగోరి సింతసెట్లు రొండు కాస్తండుగదా! ఆ సింత సెట్లు ఏరి బొట్టలొలిసి బుగత వొప్పొనం బుగత కొప్ప జెప్పి తెత్తాడు సూడు బండితో బండిడు పండు. ఇంటిల్లిపాదికీ పల్లు పులిసిపోవాల; పులుసు తాగనేక" అంది.

సంగడికి పెళ్ళాం ఎత్తిపొడుపుతో చిరాకు వచ్చింది.

''వల్లకోయే పకీరుముండా! నొటికొచ్చిందల్లా పేలీడం తెలుసునుగానీ మరింకేటితెల్దు. నోరు మూసుకోని గడప తుడుసుకో." అని కసిరేడు.

అదివిని అంకమ్మ ఊరుకోకుండా

"మూసుకొంటాన్నే! నామీదనైతే ఎగిరి పోతావు నాకు తెల్దేటి? నానుగాబట్టి కట్టిన పుస్తికి కట్టుబడిపోనాను గానీ, మరెవ ర్తయినా అయినాదిగాదు. నువ్వొడతన్న కూడుకీ గుడ్డకీ ఆ పూసలపుస్తి పుటుక్కన తెంపేసి ఎలిపోద్ద" అంది గడపలోనుండి వీధిలోకివస్తూ!

సంగడికి ఎక్కడలేని కోపం వచ్చింది.

"మాటిమాటికీ పుస్తి తెంపేస్తానని దెప్పతన్నావు గదే! నిజంగా నువ్వు మా వెంకడి కూతురివైతే పుస్తి

తెంపేసి నామీదన పడేసి ఎల్లే! నువ్వెల్లిపోతే మల్లి...!" అని అంకమ్మ మీదకి బయల్దేరాడు.

పరిస్థితి మొగుడూ పెళ్ళాల తగువులోకి మారిపోతుందని గ్రహించిన గుంపడు, సంగడ్ని పట్టుకొని ఆపుతూ

"ఆడోల మాట్లకి నెక్కేటన్నా! ఉండూ!" అని ఆపేడు.

సంగడు ఆగిపోయినా అంకమ్మ మాత్రం ఆగకుండా

"గుండియ్యా! ఆడ్ని వొదిలిద్దూ! ఆడిసంగతి నాకు తెల్దా! నా బీపీమీద మాట్లాడితే గుబీగుబీ మని గుద్దీడం తెలుసునుగాని ఆ కారపరేసన్నా కుక్కలకొడుకుల్ని తన్ని సింతపండు తేడం తెల్దా! జీపీకార్లమీద ఆ బావులు ఝుయ్యి మని వొచ్చీసరికి కావుల్లతోటి సరుకు నొదిలీసి తోంముడి సీసి పారొత్తన్రు! సిగ్గునేదు మల్లా! మొగపుట్టుక పుట్టేరు మొగపుట్టక..." అని చీదరించుకుంది.

సంగడు గుంపడ్ని విదిలించుకో బోయేడు. గుంపడు వదలకుండా ఆపుతున్నాడు. అప్పుడు బోడెమ్మముసిలి గుంపడి దగ్గరకు వస్తూ

"తాంవస పడతావేందిరా సంగా! ఆదన్న మాట లోన దోసవేటున్నాది? పుల్లటి పులుస్సుక్కకి పిల్లాది మోదల వోసిపోతున్నావు గదా! కాటిక్కాలు సాపుకోని కూకున్న నాలాటిదాన్నే, నిరుటి ఆ మావిడి బద్దల పులుసు తాగనేక కటకటలాడి పోతన్నాను. వోటి కంపు కొడుతున్న ఆ పులుసు గెంజిలోన పోసుకోని మూతిదగ్గిట ఎట్టేసరికి వోవనం వొస్తున్నాది. ఆ గుంటముండ అంటం దంచే దోసం వున్నాదేటో సూడు!" అని సర్దింది.

సంగడు కూడా కొంచెంతగ్గి

"అదికాదే బోడీ! పొయ్యిదగ్గిట కూకోని చెప్పటం కాదే! అక్కడ దేవీ ఇక్కడ దేవీ దొరికిన సొమ్మట్టుకోని రొండు గాటీలు దాటి సింతమానుగూడ కెల్లాల! తీరామాసు సరుకు కావిడికెత్తేసరికి పోలీసోలతోటి ఆ బావులు సిద్దంవైపోయి ఎంవికె లిరగబొడుస్తన్నారు, సరుకూ పోతన్నాది తాపులూ తప్పకుంటన్నాయి. అది అందుకూ నాను, నానుస్తన్నాను." అన్నాడు.

అంకమ్మ సంగడి మాటలు విని మరీ మండిపడుతూ

"ఆడికేటీ సెప్పకు బోడెమ్మత్తా! పోలీసోలంటే ఆడికి వొల్లమాలిన బియ్యం. నిరడు ఆ కామిరేడు బావు రానేదా! మీటింగెట్టి సాగనంపి తిరిగొచ్చేసరికి పోలీసోలు కాంవు నెట్టుకట్టి వొల్లు పుండు జేసినారుగదా! అది గప్పట్నుండీ బియ్యం పడిపోనాడు." అంది.

ఆ మాటతో సంగడు ఒక్క ఉదుటున అంకమ్మ దగ్గరకు వచ్చి గుప్పిటతో కొప్పు పట్టుకొని తల వెనక్కి వంచి

"ఏటి పేలేవే? మల్లీపేలు! అదిగా వూసెత్తొద్దని నీకు సెప్పనేదే!" అని పళ్ళుపటపట కొరుకుతూ చెయ్యి ఎత్తేడు.

అది చూసిన గుంపడు పరిగెత్తుకు వచ్చి సంగడి చెయ్యి పట్టుకున్నాడు. బోడెమ్మముసిలి కూడా గబగబా వచ్చి

నాయిన్నాయినా! సంగియ్య నాయినా! సచ్చి నీ కడుపుల పుడతానొరె నాయినా! దాన్ని కొడితే నాను సూడ్లేన్రా! బాబ్బావూ! దానికి నోటి దురుసెక్కువే గానీ మనుసు మామెత్తన్రా! నువ్వంటే దానికి పంచెపేణాలూన్రా! అది గప్పుడా పోలీసు బావులు నిన్ను కొడతుంటే అదెనాగ ఇదై పోనాదో, దాని పానా లెలాగ కొట్టుకులాడేయో నీకు తెల్దురా నాయినా! వొదిలియ్యరా బావూ" అని బ్రతిమాలింది.

సంగడు కొంచెం మెత్తబడ్డాడు. తరువాత సిగ్గుపడి అంకమ్మ నొదిలేసి కట్టుకొయ్య పక్కనున్న రాయిమీద మాటాడకుండా కూచున్నాడు. సంగడు అలా రాయిమీద కూచున్న తరవాత బోడెమ్మముసిలి అంకమ్మను కసురుతూ

"ఏందే! ఆడదానికి అద్దూపద్దూ ఉండక్కరనేదేంటే! నోటికేదొత్తే అది పేలీడ మేనేటి? పద పద." అని గడప లోకి తీసుకువెళ్ళి అంకమ్మని వదిలీసి సంగడి దగ్గరకు వచ్చింది.

"తెల్లారి నెగిసీసరికి వొవులి మొకం సూసినానో సంగియ్య తగువుజూసినాను. పాపిట్టి ఎదవమొకం" అని తిట్టుకుంది.

అప్పుడు గుంపడు సంగడితో మెల్లగా నచ్చజెపుతూ

"అదిగాదురా సంగియ్యన్నా! నీకు సానా సంగతులు తెలుసును. నువ్వొత్తే మరి మాకు బియ్యంనేదు, కారపరేసను బావులొత్తే సింతపండు అమ్మనానికి ఒట్టికెల్లనేదని నచ్చజెపతావు. నువ్వు బయలెల్లితే గానీ మాలపేట ఈ ఏడు సింతపండు మొకం సూడదు. పులుస్సుక్కకి వోసి

పోతారు. అదిగందు కన్నానురా! అంకమ్మెదినితో నేటి గానీ నువ్వు బయదెల్లూ! అని బ్రతిమాలేడు.

సంగడు కోపం చల్లార్చుకొని

"ఒరే గుంపా! నీకుతెల్దురా! బతిమలాడి కాలొట్టుకున్నే అలు సింతపండు వొదల్రా! ఆయేల క్రామేడు సెప్పింది మరొకపాల యాదకి తెచ్చుకోరా! పాంవులికి దండా లెడితే కరడం మానవుగాక మానవని సెప్పినారు గదా! అదిగదే నిజంరా!" అన్నాడు.

గుంపడు మామూలుగా

నిజవేఁన్రా! క్రామేడు సెప్పింది నిఙవేఁ! సూడూ! కారపరేసను బావులు సడుం కొనోన్లుగాదా! బాబ్బావూ అని బతిమాలు కుందుంగాని. నువ్వు పస్తాయించకుండా బయలెల్దూ! అన్నాడు.

బోడెమ్మ ముసిలి కూడా

"బయలెల్లు బావూ! నానూ గంపొట్టుకోని నీతో వొత్తాను. కోతిల కెల్లి దాసుకున్న పదిరూపాయిలు పట్టుకుంటాను. పది రూపాయిల సింతపండు ముసిల్దానికి ఈ పంటంతా సరిపడతాది" అంది.

సంగడు రాయిమీది నుండి లేస్తూ

"సింతపండు నాకే అక్కర్నే దనుకున్నారేట్రా! బయలెల్లండయితే!" అన్నాడు.

గుంపడు సంతోషంగా

"కొసింటి రాఁవుడూ ముత్తేలు గాడూ వొత్తా వన్నార్రా!" అన్నాడు.

"బేగి బయలెల్ల మనై తే!" అని సంగడు కావిడి కోసం డబ్బుకోసం ఇంట్లోకి వెళ్ళేడు.

ఇంటిలోనికి వచ్చిన సంగడ్ని చూసి అంకమ్మ మరేమీ అనకుండా సందుగ పెట్టెలోని రూపాయి కాయితా లందించింది. సంగడు రూపాయ లందుకొని మూలనున్న గంపలు రెండుతీసి కావిడిబద్దకు కట్టిన ఉట్టిల్లో సర్దేడు. కావిడి పట్టుకొని బయల్దేరబోయేసరికి అంకమ్మ సంగడి భుజంమీద చెయ్యేసి

"సల్లంది గెంజి తాగకుండా ఏటనాగ ఎలిపోతావు! ఎవల మీదలుగుతావేటి?" అని ఆపింది.

సంగడు కూడా కొంచెం బెట్టుగా

"ఈదిలోన కడుపు నిండిపోనాది గదా! మరి గెంజేల? నీఁ టిదాయె ఒకత్తి సంతల కోకిప్పేసి ఇంటి కొచి మొగుడి దగ్గిట సిగ్గుపడిపోయి కట్టుకున్నాదట. అదిగ నాగున్నాది నీ వొరస." అన్నాడు.

"సాఁవితిలు నాకూ వొచ్చునెత్తా? గెంజితాగు." అని సత్తు గిన్నెలో గంజిపోసింది.

"ఆలీసం అయిపోతాది గావాల." అని ఉప్పు కలిపిన గెంజి ఎత్తిపెట్టుకొని గటగటా తాగేసి అన్నం దేవుకుని మూడు ముద్దల్లో తినేసి కావిడి భుజాన వేసుకొని బయల్దేరేడు.

సంగడు మాలపేట చివరికి వెళ్ళేసరి బోడెమ్మ ముసిలి, గుంపడు, రాఁవుడు, ముత్తేలుగాడూ సిద్ధంగా ఉన్నారు. సంగడితో వాళ్ళ ఊరికి తూర్పుగా నున్న కొండలవైపుగా నడక సాగించేరు.

ముందు సంగడు నడుస్తుంటే ఆ వెనక గుంపడు, గుంపడి వెనకన బోడెమ్మముసిలి, ఆ వెనక రాఁవుడు, ముత్తేలూ వరసగా ఉన్నారు.

కొండలవరస మీదుగా తూరుపు తెలిరేఖలు తెల్లదనం నుండి ఎరుపుదనానికి మారుతున్నాయి. కొండల మీద చెట్లు ఆకులు రాల్చడంతో పచ్చగా కనిపించవలసిన కొండలన్నీ జేగురు రంగులో కనిపిస్తున్నాయి. కాయలతో నున్న మామిడిచెట్లూ పువ్వులతో నున్న ఇప్పచెట్లూ అక్కడక్కడా పచ్చగా కనిపిస్తున్నాయి. అడవి పక్షులూ నీటి బాతులూ బారులు బారులుగా పల్లాన్నున్న చెరువులవైపు అరుచుకుంటూ వస్తున్నాయి. నిద్రలేచిన నెమళ్ళు మనుషులు నడుస్తున్న అలికిడి విని టపటపా రెక్కలు కొట్టుకొని ఆకాశం మీదకి లేచిపోతున్నాయి. కారుకోళ్ల పిల్లల్ని వెంటపెట్టుకొని గచ్చపొదల్లోకి పరంకంపల్లోకి పారిపోయి దాక్కుంటున్నాయి.

కొండమీద నుండి సూర్యుడు కరకరమని పొడవగా సంగడు చింతమానుగూడ ఘాటీ ఎక్కుతూ వెనక్కి చూసి అలసిపోతున్న బోడెమ్మ ముసిలితో

"బోడీ! నువ్వెందు కొచ్చినావే మా ఎనకాతల? బరువు నేకండా ఘాటీ ఎక్కేసరికే జాపోసి పోతన్నావు. సింతపండు గంపతోటి ఎనాగ నేత్తావే?!" అని అడిగేడు.

బోడెమ్మ ముసిలి అలుపు తీర్చుకొందికి నిలబడి

"పుల్లటి పులుసుక్కకి ఆశపడిపోయి బయలెల్లి నా(నా నాయినా? పేణాలు కడారిపోతన్నాయి". అని మళ్ళీ నడక మొదలెట్టింది.

గుంపడు వెనకనున్న బోడెమ్మ ముసిలితో

"మెల్లిక నడు. సవ్వగలవు." అని సంగడితో సంగన్నా! సంతనొదిలేసి ఇటుకాసొచ్చినావేటి?" అని అడిగేడు.

సంగడు నవ్వుతూ

"ఆ కారపరేసను బావులేన్నెరా! అలియాల సంత కొత్తారు. సంతలోన మన్ని సింతపండు కొన్నివ్వకుండా అడ్డేత్తారు. సింతమాను గూడ సవర్లు సానామందిని నా నెరుగుదును. ఆలు సింతపండొట్టుకోని ఇనాగే సంత కొత్తారు. తోవల మనం కాస్నేవంటే మంచి బొట్టసరకు దొరుకుతాది. అదొట్టుకోని మనం అడ్డతోవల బడి అలకంట బడకుండా దాటిద్దుం." అని వివరించేడు.

ఆ మాటలు విన్న బోడెమ్మముసిలి సంతోషంగా నీ కడుపు సల్లగుండ నీ బుర్రలో ఎన్నాలో సన్లు న్నాయిరా? మా కడజాతిల పుట్టీనేపుగానీ రాజా పుట్టకరా పీది. సింతపండు సల్లగ ఏంటికి సేరి పోనాదంటే ఈ పంటంతా నీపేరు సెప్పుకోని పుల్లటి పులుసుక్క తాగు తాను." అని నో రొకసారి చప్పరించింది.

బోడెమ్మ ముసిలి మాటలకు సంగడు పకపకా నవ్వి

"ఒరే గుంపా! అదుగో ఆ సెట్టునేదా? దాన్ని దారి మావిడి సెట్టంటారు. సంతకనొచ్చిన సవర్లు అదార్నే వొత్తారు. ఈ పాలికి సానామంది రావొచ్చును గూడా! నాలుగడుగులెయ్యి!" అని తొందరగా నడిచేడు.

సంగడు దారిమామిడిచెట్టు చేరేసరికి చింతపండు గంపలు దించి చెట్టుక్రింద ఆడా మగా ఇరవైమంది వరకూ కూర్చున్నారు. సంగడు తనకు తెలిసిన ముఖాలున్నా యేమోనని చూస్తూ, కూచున్న వాళ్ళ దగ్గరకు వెళ్ళేడు.

చెట్టుక్రింద కావిడి దింపుతుండేసరికి గుంపులో కూర్చున్న సవర్లలో ఒకతను చూసి

"ఏంది నేస్తం? ఇటు కాపలికిదైనా వేంది? సింత పిక్కకే నేటి?" అని పలకరించేడు.

సంగాడు సుక్కాయ్‌ని చూచి చాలా చాలా సంతో షించేడు. సంతోషంలో

"సింతపండుకే ఇటు కాసొచ్చినాను. కుసింత మా కమ్ముతారేటి?" అని అడిగేడు.

సుక్కాయ్ తల వూపుతూ

"మీకు పదినంత కొనుక్కొండి. ఆ కారపరేసను బావుల కమ్మడం మా కిట్టవ(ను కొన్నారేటి?" అని అమ్మీ! ఆ గంపలిటు పట్టండి. సంగియ్య ఎంచుకుం టాడు." అని కేక వేసేడు.

ఆడా మగా గంపలతో చింతపండు తెచ్చి సంగడి ముందుంచేరు. బోడెమ్మముసిలి గంపల ముందుకు వచ్చి కూచొని గంపలోని చింత బొట్టల్ని ఎత్తిచూసి

"మా బాగున్నదిరా సంగా! కట్టసరుకు. ఎండు పండు దొరికినాది. బెల్లం నాగున్నది." అని ఒక బొట్టి తింటూ "దర బేగి తేలిసిమ్మీ." తొందర చేసింది.

సుక్కాయ్ సంగడితో

"మీ పల్లపోలు ఎనాగ కొంటన్నారో ఆ నెక్కన ఇచ్చే సంగయ్యా! ఆ కారపరేసను బావులున్నరు సూసేవా? అలైతే ఎనబయి పైసాల నెక్కన కేజీ కడతారు. పైన మా(వమ్ముకుంతే రూపాయి పావలా దర పలుకుతాది. మా(వుగాని పైనమ్మితే పోలీసోల సేతన కొట్టించేత్త న్నారు. అది గందునేతన సంతలకి మోసుకెల్తన్నావు(. మావోలు గూడా తక్కవతిన్నేదునే! ఈ సింతపండుని గాటీ దిగవన గెడ్డనేదా? అదిగక్కడ తడిపేత్తారు. ఆకాడికీ ఆ లింతకంత తూస్పి డబ్బు దొబ్బుతారు." అని చెప్పేడు.

బోడెమ్మముసిలి, గుంపడు, రా(వుడు, ముత్తేలు గాడూ చింతపండు తూయిస్తున్నారు. సింగడు సుక్కాయ్ మాటాడుకుంటూ కూర్చున్నారు.

సుక్కాయ్‌తో సంగడు

"మనోలు ఈ మద్దిన ఇటుకా సొస్తున్నా రేటన్నా?" అని అడిగేడు.

సుక్కాయ్ అటూ ఇటూ ఒకసారి చూసి

"రానేదు. సానా దెబ్బలు తినేనే(వు సంగియ్యా? పోలీసోల మద్దిన బతక తన్నావు. నేపోతే ఇలాటి పింటి అన్నేయాలు సాగిపోతాయేటి? మీకు మాత్తరం ఈ సింత పండు ఆల కంట్ల బడకండా వొట్టికెల్లాల. కంట్ల బడితే సానా సిక్కు." అన్నాడు.

ఈలోగా బోడెమ్మముసిలి సంగడ్ని కేకేసింది. సంగడూ సుక్కాయ్ లేచివెళ్ళేరు. సంగడు రావడంతో బోడెమ్మ ముసిలి

"నీ సొమ్ము తియ్యిరా! తూకంవై పోనాది. పండు కావుళ్ళ కెత్తాల" అంది.

సంగడు డబ్బుతీసి బోడెమ్మ ముసిలిచేతికిచ్చి తూచిన చింతపండు తన గంపల్లోకి ఎత్తేడు. గంపలు కావిడి ఉట్లల్లో పెట్టి మోచేతులతో ఒకసారి కావిడి ఎత్తెడు. బరువుతో కావిడి పెటపెటలాడింది. తృప్తిగా తలూపి కావిడి బుజానికెత్తుకున్నాడు. బోడెమ్మముసిలి సుక్కాయ్ చెయ్యి సాయంతో గంప నెత్తిమీదకి ఎత్తుకుంది. మిగిలిన వాళ్ళు ఎవరి కావుళ్ళు వాళ్ళు బుజాలమీద సర్దుకున్నారు. సంగడు సుక్కాయ్‌తో వస్తామని చెప్పి ముందుతోవ తీసేడు.

ఘాటీమీద నుండి వరుసగా నాలుగు కావుళ్ళూ, ఒక తలగంప, చింతపండు దిగుతుండడం కొండఎక్కబోతున్న (గిరిజన) కార్పొరేషన్ అధికారి చూసేడు. వెంటనున్న నలుగురు సిబ్బందికి చూపించేడు. వెంటనే ఐదుగురూ తోవ ప్రక్కకు తప్పుకున్నారు.

సంగడు ముందునడుస్తూ ఘాటీ దిగి ఆగి, వెనకనున్న వాళ్ళతో

"ఇదిగిప్పుడు మనం తోవ తప్పించేసి అడ్డదార్ని పడాలి. నా ఎనక రండి." అని చెప్పేడు.

గుంపడు వెనకనుండి

"అనాగే పద." అన్నాడు.

సంగడు కదిలేసరికి కార్పొరేషన్ అధికారి పక్కనున్న చెట్టుకొమ్మ విరిచి రెమ్మలు వలిచి పచ్చిబడితెగా తయారు చేస్తూ

"త్రోవ తప్పిస్తావురా! దొంగలంజాకొడకా! ఇలాగ చింతపండు దాటవేసి బట్టే గవర్నమెంటు నష్టపోతుంది. నిలబడురా! అక్కడే నిలబడు" అన్నాడు.

హఠాత్తుగా కార్పొరేషన్ అధికారి మాటలు వినేసరికి వాళ్ళందరి గుండెలు గుభేలు మన్నాయి. సిబ్బందిని చూసి పైప్రాణాలు పైనే ఎగిరిపోయేయి. ఒక్క సంగడు మినహా మిగతా ముగ్గురూ కావుళ్ళు దించేసేరు. బోడెమ్మముసిలి

"అమ్మనాయినోయ్! సింతపండు పోనాదోర్నాయినోయ్!" అని అరుస్తూ వెనక్కి పరుగెత్తి పారిపోయింది.

అది చూసిన కార్పొరేషన్ అధికారి మండిపోతూ ఒక్క ఉదుటున బోడెమ్మ ముసిలి దగ్గరకు వెళ్ళి

"ఎటు పారిపోతావే దొంగలంజ కూతరా? ఆగక్కడ!" అని చేతినున్న పచ్చిబడితెతో ముసలిదాని నడుం మీద ఒక దెబ్బ కొట్టేడు.

ఆ దెబ్బకు బోడెమ్మ ముసలి గంపతో సహా రాళ్ళ మీద "సచ్చిపోనాను బాబోయ్?" అని పడిపోయింది.

కార్పొరేషన్ అధికారి పడిపోయిన ముసలిదాని వీపు మీద చేతికి వచ్చిన దెబ్బ కొడుతూ

"చచ్చిపోయినావటే దొంగముండ కూతురా! చింతపండు మా కింట్లో కారం కొట్టి పట్టుకు పోతున్నప్పుడు రాని చావు దొరికిపోయేసరికి వచ్చిందా? అలాగయితే కావు. గుమ్మతీసి ఇక్కడే పాతెస్తాను." అంటూ బడితె ఫిరాయించేడు. బోడెమ్మ ముసిలి కిరకిర చుట్టుకుంటూ

"దండాలు బాబోయ్! కొట్టకుబాబోయ్" అంటూ దెబ్బలకు ఓర్చుకోలేక అటూ ఇటూ దొర్లుతూ చేతులెత్తి దండాలెడుతుంది. ఆ దొర్లడంలో ఆమెకున్న చింకిపైట తొలగిపోయి ఎండుగుండెలు బైటపడ్డాయి. అది చూసి అధికారి కోపం ఇంకా ఎక్కువైపోయింది.

"చాలించే దొంగవేషాలు ఛత్కారీ ముండా!" అంటూ పైటతొలగిన ఆమె ఎండుగుండెల మధ్యన బూటు కాలితో తన్నేడు.

బోడెమ్మముసలి తీవ్రమైన బాధతో

"బాబూ!" అని పెద్దగా అరిచింది.

అప్పటివరకూ నోట మాటరాని సంగడు కావిడి దించి కార్పొరేషన్ అధికారికీ బోడెమ్మముసిలికీ మధ్యకు వచ్చి నిలబడి అధికారికి దండం పెడుతూ

"బావూ, తమరు పెద్దోలు. సదుంకున్న మారాజులు. మాంవు ఈ సింతపిక్క పులుసు కాసుకోనానికి కొనుకున్నాం అమ్మకానికీ, నాబాలు తియ్యనానికీ కాదుబావూ! ముసిల్ది. తమరు ఇదిగీ ఇదంగా కోపంవైపోతే సచ్చిపోతాది పుల్లటి పులుసుకి వోసిపోయి పానాలు బిగబట్టుకొని ఇనాగొచ్చినాది. కొట్టకండి బాబూ!" అని బ్రతిమాలేడు.

అధికారి సంగడ్ని చూసి మరీ కోపంగా

"పులుసుకోసం వాచిపోనార్రా! ఒరే మీ దొంగ బ్రతుకులికి పులుసు కావలసి వచ్చిందిరా. అడివి మీ యబ్బ సొమ్మను కొనుంటున్నార్రా! గవర్నమెంటు మీకు అలుసై

పోయిందిరా! కార్పొరేషనంటే మీకాలి గోరులాగ కనబడు తుంది. ప్రతి తలమాసిన్నా కొడుకూ కొండలెక్కిపోయి కావుళ్ళతో చింతపండు మోసేస్తే మా గొడౌన్లెందుకు? మా లారీలూ జీపులూ జీతాల్కొఉద్యోగాలుఎందుకు? నిన్ను ముందు తన్నాల్రా!" అని బడితతో సంగడి మోకాలిమీద ఒక్కటి కొట్టేడు.

సంగడు దెబ్బ ఓర్చుకుంటూ

"బాపూ! తవురు కొట్టేరని బాదనేదు బాపూ! ముసిల్ది. దానిగంప వొదిలీసి మా కావుళ్ళు తీస్సికొండి. మాఁవే మోసుకోనొచ్చి మీ గోదాంల పడేత్తాం." అని చేతులెత్తి దండం పెట్టేడు.

అధికారి దండంపెట్టిన చేతిమీద మరొకటి కొట్టేడు కొట్టిన తర్వాత తన సిబ్బందితో

"చూస్తూన్నారేమిటి? ఆ ముసిల్దాని గంపలోని చింతపండు నాలుగు కావుళ్ళలో సర్దండి." అన్నాడు.

సిబ్బంది నలుగురూ గబగబా గంపదగ్గరకు వచ్చేరు. అది చూసిన బోడెమ్మ ముసిలి జారిపోతున్న బట్టనుకూడా సర్దుకోకుండా గంపలోని చింతపండును రెండుచేతుల్తోనూ ప్రేమగా పట్టుకుంటూ

నా సింతబుట్ట కొంచబోకండి బాపూ! దొరబాపులూ! మీకు దండాలు, ముసిలిముండని ఏడిపించొద్దు" అని ఏడుస్తూ చింతపండుమీద బోర్లా పడిపోయింది.

చింతపండును తియ్యనీయకుండా అడ్డంగా పడిఉన్న బోడెమ్మముసిలిదాన్ని కార్పొరేషన్ సిబ్బంది నలుగురూ పక్కకు ఈడ్చేసి చింతపండు గంపను కావుళ్ళలో సర్ద డానికి తెస్తున్నారు.

బోడెమ్మముసిలి చింతపండు చెయ్యిదాటి పోతుందని గొల్లున ఏడుస్తూ నెత్తి బాదుకొంటూ

"ఆపండి బాపూ! మీ కాళ్లట్టుకొంటాను." అని అధికారి కాళ్లమీద అమాంతం పడిపోయింది. అతని తెల్లని ఇస్త్రీపేంటు మురికైపోయింది. అది చూసిన అధికారి అగ్గి మీద గుగ్గిలం అయిపోయాడు. ఆ కోపంతో చేతినున్న బడితెతో మాటాడకుండా బోడెమ్మముసిల్ని బాదేస్తున్నాడు.

బోడెమ్మముసిలి దెబ్బదెబ్బకూ మెలితిరిగి పోతుంది. వొంటిమీద బట్ట చాలామట్టుకు వూడిపోయింది. అదికూడా గమనించని అధికారి పచ్చిబడితెని మరొక్కసారి ఎత్తేడు

సంగడికళ్ళు నిప్పులు కక్కేయి. ఛరాలున తన కావిడి దగ్గరకు వెళ్ళేడు. కావిడి బద్దను ఉట్టిల్నుండి ఊడ దీసి తనవారితో

"సూత్తారేందిరా! సవటనా కొడకల్లారా! ఒరే గుంపా రావుడూ ముత్తేలూ! సచ్చిం దొకరోజూ బతికింది ఒక రోజేన్రా! తియ్యండ్రా కావిడ బద్దలు" అంటూ

ఒరే! ఆగొరే కసాయి నాకొడకా! ఈ అడివి నీ అత్తోరిచ్చేర్రా నీకు? నీ పెల్లాం మెడలోని బంగారవూఁ నువ్వేనకేసిన ఏలూ నచ్చలూ ఎక్కడివిరా? నీ బామ్మరు దులుకీ సుట్టపక్కాలికీ పెదబావుకీ సింతపండు సరదనానికి దొంగ రవాణాలు సెయ్యనానికీ పరవానేదు గదరా! ఆ ముసిల్దాని బుట్టడు సింతపండు పోతే నీకూ నీ పెల్లానికీ గవుర మెంటోడికీ నట్టాలేవి వొచ్చినాయిరా! తీసుకుంటే ఆ సింతపండు తీసుకోమని నీకా గవురమెంటు సెప్పిందేటో గానీ సావు దెబ్బలు కొట్టమనీ తిట్టమనీ నీ కేనాకొడుకు సెప్పినాడు? సచ్చేవ్రా నాకొడకా" అని కావిడి బద్ద తిరగేసి సాచి ఒక్కటి కొట్టేడు. అంతే!

"అమ్మబాబోయ్! నక్సలైట్లు" అని అధికారి పరుగు పెట్టేడు. సిబ్బంది బోడెమ్మముసిలి చింతపండు బుట్టను వదిలేసి అధికార్ని అనుసరించారు. పారిపోతున్న కార్పొ రేషన్ వార్ని చూసి గుంపడికి అంతబాధలోనూ నవ్వాగ లేదు.

"ఓరే! పిరికినా కొడకలుగదర కొడకలు. నిలబడం ఖారే!" అని కేకవేశాడు.

తుప్పల్లో డొంకల్లో పడుతూ లేస్తూ కార్పొరేషన్ సిబ్బంది కనబడకుండా పారిపోయేరు.

సంగడు కోపాన్ని దిగమింగుకొని తొందరగా కావిడి బద్దకి ఉట్టిలు తగిలిస్తూ

"దాని బుట్టడు సింతపండు మన నాలుగు కావుల్లలోన సరిదీసి పరుగులమీద పదండి. ఈసారి, పోయిన పిరికినా కొడుకులు పోలీసోల దగ్గిరకెల్లి అల నొట్టుకొత్తారు. బేగి పదండి" అన్నాడు.

గుంపడూ రాఁవుడూ ముత్యాలూ బోడెమ్మముసిలి గవండు చింతపండునీ నాలుగు కావుళ్ళలో సర్దుతుండగా సంగడు, ఏడుస్తు కోక సర్దుకొంటున్న బోడెమ్మ ముసిలితో

"మరేనేటుడ! నడు. మిట్టకాయేసి నంతసేపుల్లో మనూరెలిపోవాల" అన్నాడు.

బోడెమ్మ ముసిలి ఏడుపు ఆపకుండా

"సచ్చిపోత్నా్రనా నాయినా! రకతాలు సిమ్ముతన్నాయి సచ్చిపోతానుగావాల" అంది.

సంగడు తొందరగా తనకావిడి భుజానికి ఎత్తుకుంటూ

"మన పానాలు మాగట్టియి! అయంత బేగి పోవునే! నడునడు" అని ఐదుగురూ నడక సాగించేరు.

బోడెమ్మ ముసిలి వారితో సమంగా నడుస్తూ అప్పు డప్పుడూ కుంటుతూ

"గుండిలమీద తన్నేవుగదూ! నీ కాలు పడిపోనూ. నీకు పెద్దరోగం పట్టుకోనూ ...నీ ఇంట్ల సెవం సెల్లిపోనూ" అని తిడుతూంది.

అడ్డదారంట ఐదుగురూ మాలపేట చేరుకున్నారు. ఎవరింట్లో వాళ్ళు చింతపండు సర్దేసి సంగడింటికి వచ్చేరు. అప్పటికే సంగడి దెబ్బల్ని చూసిన అంకమ్మ ఏడుస్తూ

"ఏ్రటా! ఈ దెబ్బలు. ఎవుడు కొట్టినా్రడా? ఆడి సేతులు పడిపోనూ!" అని తిడుతూంది.

బోడెమ్మముసిలి ముక్కు ఎగజీదుతూ

"నాదెబ్బలు సూడే!" అని వీపూ గుండె చూపించింది.

అది చూసి అంకమ్మ మరీ గట్టిగా ఏడుస్తూ

"సచ్చిపోనా వోలత్తో..." అని దెబ్బల్ని తడివింది.

ఏడుస్తున్న అంకమ్మని కసురుతూ సంగడు

"ఇదిగో! మీతోటి వొకటి సెప్పాల! మనం సింత పండుకెల్లినట్టగ ఎవురికీ తెలియనియ్య గూడదు. కిక్కురు బొక్కురు మనగూడదు. సూసినాంగదా! ఈ యన్నేయపు రాజ్యం కల్లతోటి సూస్సినాంగదా! ఇది గీపింటిఇదంగా మనలాటోల్లకి పెతిరోజునా కొడతన్నారు. తంతన్నారు. జెల్లోన పెడతన్నారు. కాలస్తన్నారు.

ఇయాల మనం పుల్లటి పులుస్సుక్క కోసం... మరేటిగాదు పులుసుకోసం, మన వొల్లు పులుసు సేసు కొన్నాం. మన వొల్లు పులుసు సేసుకున్నప్పుడు ఆడు... ఆ కారపరేసన్నాకొడుకు పులుస్సుక్క ఇవ్వనేడు. సరిగదా సింతపండంతన్నూ పడేసి కోనానికే సూసేడు. మనం బతిమిలాడేం. దండాలెట్టినాం, మన దండాలికి మనకి పులుసు దొరకనేదు సరిగదా వొల్లంతా పులుసై పోనాది.

అదిగప్పుడు, అలాటప్పుడు, మనంవేటి సేసినాం? కర్రెత్తి అది గానాకొడుకు వొల్లు పులుసై పోయినట్టిగ వొక్కటంటే ఒక్కటే ఇచ్చినాం. అప్పుడేమైనాది? పులుసుకి సింతపండు దొరికినాది. వొణ్ణంలోకి కాదు; గెంజిలోకి పులుస్సుక్కకోసం కర్రెత్తితేనేగాని దొరకనేదు.

"మరందు సేతన పులుసుకోసమే కర్రెత్తినాంగదా! మరి కడుపునిండా వొణ్ణం కావాలంటే వుత్తివున్నేనికే దొరుకుతాదను కొంటన్నారేటి? మరి దానికోసం ఏదట్టు కోవాల? తెలిసిపోతన్నాది గదా?"

"కర్రట్టుకుంటే పులుసుదొరికినాది. మరి కత్తికాదు, అడివిలోని అన్నల్లా తుపాకొట్టుకొంటేనే వొణ్ణం దొరుకు తాది" అని సంగడు ఉద్రేకంతో చెబుతుండగా;

బోడెమ్మముసిలి కసిగా, తాను ఆనోటా ఈనోటా విని గుర్తుంచుకొన్న నినాదం,

"ఇప్లవం వొర్దిల్లాలి." అని అరిచింది.

అంతా ముక్తకంఠంతో ఆ బాధలో ఆ అనుభవంతో "విప్లం వర్ధిల్లాలి." అని నినదించేరు.

అంజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం

— శ్రీ శ్రీ